సాక్షి వికారాబాద్

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



మట్టి గణపతికి.. జై

పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని వినాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. 10లో ▸



విజయభేరిని సక్సెస్ చేద్దాం

ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరిని సక్సెస్ చేయాలని మాజీ మంత్రి చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. 11లో ▸



కేసీఆర్‌తోనే సుస్థిర పాలన

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే పల్లెల్లో సుస్థిర పాలన సాధ్యమవుతోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. 11లో ▸

న్యూస్‌రీల్

ఓటరు జాబితా స్పష్టంగా ఉండాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ఫారం 6, 7, 8లో వచ్చిన వినతులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమ్మర్ స్పెషల్ రివిజన్ ఎస్ఎస్ఆర్ –2023లో భాగంగా చేపట్టిన ఓటరు నమోదు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. మరణించిన, డబుల్ ఓటర్లను గుర్తించి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో వారి పేర్లు తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటు హక్కు పొందేలా చూడాలని ఆదేశించారు. 19తేదీ లోపు ఈ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎస్ఏపీ డిగ్రీ కళాశాల, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, పూడూరు మోడల్ స్కూల్‌లో ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధం అన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ కోటాజి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనూషకు ఘన సన్మానం



అనూషను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్: ఇటీవల వెలువడిన అగ్రిసెట్ – 23 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని అప్పాయిపల్లికి చెందిన అనూష రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. గ్రామానికి చెందిన వెంకటప్ప, లక్ష్మి దంపతుల కూతురు అనూష అందోల్ మండలం సంగుపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అగ్రికల్చర్ డిప్లమా పూర్తి చేసింది. ఆగస్టు 26న అగ్రిసెట్ ప్రవేశ పరీక్ష రాసింది. 9.42 జీపీఏ మార్కులు సాధించి మొదటి ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం గ్రామానికి చేరుకున్న అనూషను ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు చంద్రకళా బాయి, వెంకటయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా చేపట్టాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీరావు, జిల్లా నాయకుడు బొడ్డు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బదిలీల కోసం వైద్య ధ్రువ పత్రాలను సమర్పించిన దరఖాస్తులను తిరిగి పరిశీలించాలని కోరారు. నకిలీ వైద్య పత్రాలను గుర్తించి వారిని జాబితా నుంచి తొలగించి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పౌస్ కేటగిరీలో 5 నుంచి 8 ఏళ్లు నిండకుండానే మళ్లీ దరఖాస్తు చేసుకున్న వాటిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేసినా వ్యక్తిగత బాధ్యత వహించేలా ఉపాధ్యాయుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. కేటగిరీ–1లో పని చేసి కేటగిరీ– 3గా పని చేసినట్లు నమోదు చేసుకొని అదనపు పాయింట్లు పొందిన వారిని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి: రాచకొండ సీపీ

తుర్కయంజాల్: గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్ మాసబ్ చెరువును శుక్రవారం చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా మాసబ్ చెరువులో గణనాథుల నిమజ్జనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నగర శివారు ప్రాంతం కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కల సాకారమైన వేళ

- మెడికల్ కళాశాలను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం కేసీఆర్
- హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యేలు
- వికారాబాద్‌లో భారీ ర్యాలీ
- జిల్లా ప్రజలకు వరం: మంత్రి మహేందర్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి పట్నం, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్

వికారాబాద్: జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు ఇక్కడి ప్రజలకు వరమని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ వికారాబాద్ మెడికల్ కళాశాలను వర్చువల్‌గా ప్రారంభించారు. రూ. 230 కోట్లతో మెడికల్ కళాశాల, 280 పడకల జనరల్ ఆస్పత్రిని ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.8 కోట్లు వెచ్చించి అనంతగిరి గుట్టపై నిర్మించిన తాత్కాలిక భవనంలో 100 సీట్ల సామర్థ్యంతో వైద్య కళాశాలను ప్రారంభించారు. అంతకుముందు పట్టణంలోని ఆలంపల్లి నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, టీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి కళాశాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల నిర్వహణ ఎంతో భారమైనా వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో కేవలం మూడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలే ఉండేవన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో 26 మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. మరో రెండేళ్లలో ఈ సంఖ్య 34కు చేరడం ఖాయమన్నారు. కళాశాలలో సీటు పొందిన వైద్య విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు.

హెల్త్ సెక్టార్ మరింత బలోపేతం: కలెక్టర్

వికారాబాద్‌లో వైద్య కళాశాల ఏర్పాటుతో ఇక్కడ ఆరోగ్య సదుపాయాలు కూడా పెరుగుతాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. అంతేకాకుండా వైద్య రంగం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఇక్కడ సీటు వచ్చిన విద్యార్థులు అదృష్టవంతులని ఆయన అన్నారు. తెలంగాణ ఊటీగా పేరు పొందిన అనంతగిరిలో కళాశాల ఉందని తెలిపారు. వైద్య కళాశాలకు శాశ్వత భవనం కూడా ఇక్కడే నిర్మించనున్నట్లు తెలిపారు. నిరక్షరాస్యత అధికంగా ఉన్న మారుమూల జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఆయన జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

స్థానికంగా పని చేస్తే ఆ తృప్తే వేరు: ఎమ్మెల్యే

మాతృభాష.. పుట్టిన ఊరు.. జీవితంలో ఎంతో మధురానుభూతిని ఇస్తాయని, అలాంటి మనం పుట్టి పెరిగిన ప్రాంత ప్రజల మధ్య వైద్య వృత్తిలో పని చేస్తే ఆ తృప్తే వేరని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. స్వతహాగా డాక్టర్ అయిన ఆయన కాసేపు వైద్య విద్యార్థులతో మాట్లాడారు. వృత్తి పరంగా వారికి పలు సూచనలు చేశారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృ భాషను మరచిపోరాదని సూచించారు. వైద్య వృత్తి మిగతా వృత్తులకంటే ఎంతో భిన్నమైనదని.. వైద్యులను జీవితంలో ఎవరూ మరచి పోలేరని తెలిపారు. వైద్య వృత్తి చేపట్టినప్పుడు అందరిని సమానంగా చూడాలన్నారు. ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.



ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

సీఎంకు జిల్లా ఎమ్మెల్యేల కృతజ్ఞతలు

వికారాబాద్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేయడంపై సీఎం కేసీఆర్‌కు జిల్లా ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వాలు వైద్య రంగాన్ని విస్మరించాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలు వైద్య విభాగాన్ని ఎంతో బలోపేతం చేశాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒకేసారి తొమ్మిది వైద్య కళాశాలలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇది జిల్లా ప్రజలు మరచిపోలేని రోజుని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ విజయకుమారి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మమాలిని, సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొన్నారు. అయితే కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మంత్రి సబితారెడ్డి ఫొటో లేకపోవడం బీఆర్ఎస్‌లో దుమారం రేపింది. కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి ఫొటో వేయకపోవడం ఏమిటని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

డిజిటల్ 'ఆరోగ్యశ్రీ'

- కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ డిజిటల్ కార్డు
- మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటి వరకు 25వేల మంది వివరాల సేకరణ



ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల కోసం వివరాలు సేకరిస్తున్న ఆరోగ్యమిత్రలు

వికారాబాద్ అర్బన్: పేదలకు కార్పొరేట్ వైద్యం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరే. 2004లో మహానేత వైఎస్ పేదల కోసం ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. ఈ పథకం అమలుతో లక్షలాది మంది పేదలకు మేలు జరిగింది. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న ఎన్నో పేద కుటుంబాలు వారి ప్రాణాలను కాపాడుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఉన్న కార్డుల స్థానంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తున్నారు.

మీసేవ ద్వారా..

ఆరోగ్యశ్రీ కార్డును డిజిటల్ కార్డుగా మార్చుకోవడం జిల్లాలో ఆగస్టు నుంచి ప్రారంభమైంది. ఆరోగ్య మిత్రులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 25వేల మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ మీ సేవ కేంద్రాలకు వెళ్లి డిజిటల్ కార్డులుగా మార్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

డిజిటల్ కార్డులో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్

ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.5 లక్షల వరకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ ద్వారా కూడా పలు రకాల వ్యాధులకు రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కార్డులో కుటుంబ సభ్యులందరి పేర్లు ఉండేవి. ఇప్పుడు డిజిటల్ కార్డు కావడంతో కుటుంబంలోకి ప్రతి ఒక్కరికి కార్డు ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,41,264 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. ఆరోగ్యశ్రీ కార్డును ఆధార్ కేంద్రానికి తీసుకెళితే అందులోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పది రోజుల తరువాత ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు లబ్ధిదారులకు అందుతాయి. ప్రతి ఒక్కరికీ డిజిటల్ కార్డు ఉంటే వైద్య సేవలు పొందడం సులువు అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లినప్పుడు డిజిటల్ కార్డుపై ఉన్న బార్ కోడ్ లేదా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ వ్యక్తి పూర్తి వివరాలు తెలిసిపోతాయి. తద్వారా వెంటనే చికిత్స చేయడానికి వీలు పడుతుందని అధికారులు అంటున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పలు రకాల శస్త్ర చికిత్సలు, 1,584 రకాల జబ్బులకు ఉచిత వైద్యం అందుతోంది. వీటిలో ఆయుష్మాన్ భారత్ ద్వారా 642, ఆరోగ్యశ్రీ ద్వారా 942 రకాల వైద్య సేవలు అందుతున్నాయి.

డిజిటల్ కార్డులతో మేలు

ఆరోగ్యశ్రీ కార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ కార్డులు అందజేస్తోంది. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఆహార భద్రత కార్డు, ఆధార్‌తో లింక్ చేసిన సెల్‌ఫోన్ నంబర్, ఇతర వివరాలు మీసేవ కేంద్రంలో అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వాటి ఆధారంగా ప్రభుత్వం డిజిటల్ కార్డులు జారీ చేస్తుంది.

– వీరేష్ గౌడ్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్

'పాలమూరు'కు జిల్లా రైతులు

- నేడు పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- జిల్లా నుంచి 134 బస్సులు ఏర్పాటు చేసిన అధికారులు

వికారాబాద్: కొల్లాపూర్ నియోజకవర్గం నార్లపూర్ వద్ద పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి జిల్లా నుంచి రైతులను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ శనివారం ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం జరిగే సీఎం బహిరంగ సభకు జిల్లా నుంచి 134 బస్సులు ఏర్పాటు చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో వ్యవసాయ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నుంచి 7వేల మందిని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి 100 బస్సులు, పరిగి నుంచి 10, తాండూరు నుంచి 10 బస్సులు, వికారాబాద్ నుండి 14 బస్సులు వెళ్లనున్నాయి. ఒక్కో బస్సులో 50 మంది చొప్పున దాదాపు 7వేల మందిని తరలించనున్నారు. ఉదయం 6నుంచి 8గంటల మధ్యలో బస్సులు బయలుదేరనున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే..

'పాలమూరు' ఫేజ్ –2



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

- కృష్ణా జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి చిన్నారెడ్డి
- బీజేపీకి బీ టీంగా బీఆర్ఎస్ పనిచేస్తోందని ఆరోపణ

పరిగి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సీఎం కేసీఆర్ తీరని అన్యాయం చేశారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పరిగికి తీసుకొచ్చేందుకు రామ్మోహన్‌రెడ్డి ఎంతో పోరాటం చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయంతో ఆయన పోరాటం వృథా అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పాలమూరు–రంగారెడ్డి ఫేజ్– 2 తీసుకొచ్చి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వారి ప్రాంతాల్లో లబ్ధి చేకూరేలా ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకుంటున్నారని ఆరోపించారు. 40 శాతం పనులు కూడా పూర్తికాని పాలమూరు ప్రాజెక్టును ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చి ప్రారంభించడం సిగ్గు చేటన్నారు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టులో ఒక్క కాలువైనా తవ్వారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను రెండు సార్లు మోసం చేసి అధికారంలోకి వచ్చారని, ఈ సారి వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కర్ణాటక తరహా ఫలితాలే తెలంగాణలో కూడా వస్తాయన్నారు. ఈ నెల 17న నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, పలు మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, అశోక్, సురేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో కుల్కచర్ల మండలం ఘనాపూర్‌కు చెందిన 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- లేదంటే వారి సమ్మెకు మద్దతుగా నిలుస్తాం
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



అంగన్‌వాడీలకు మద్దతుగా సమ్మె శిబిరంలో కూర్చున్న సీఐటీయూ నాయకులు

తాండూరు రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే వారి సమ్మెకు మద్దతుగా నిలుస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలాగే పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కాంగ్రెస్ నాయకులు సంతోష్, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెట్ ప్రశాంతం



తాండూరు టౌన్: హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన టెట్ ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈఓ రేణుకాదేవి తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, అలాగే సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో జరిగిన పేపర్ –1 పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఓఎంఆర్ షీట్, పేపర్ కోడ్‌పై ఆరా తీశారు. పరీక్ష పేపర్లను బందోబస్తు మధ్య తరలించాలని ఆదేశించారు. జిల్లాలో టెట్ పేపర్ –1 పరీక్షకు 5,765 మంది హాజరు కావాల్సి ఉండగా 5,160 మంది వచ్చారు. మధ్యాహ్నం జరిగిన పేపర్ –2 పరీక్షకు 3,846 మందికి గాను 3,689మంది హాజరైనట్లు తెలిపారు.

ఇబ్బందులు పడిన అభ్యర్థులు

జిల్లా కేంద్రంలో టెట్ పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఇబ్బందులు తప్పలేదు. పరీక్ష కేంద్రాల వద్ద సెల్‌ఫోన్, వెంట తెచ్చుకున్న బ్యాగులు డిపాజిట్ చేసేందుకు ఎలాంటి కౌంటర్లు ఏర్పాట్లు చేయలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి లగేజీతో వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. అక్కడ ఉన్న సిబ్బందిని డిపాజిట్ చేసుకోవాలని వేడుకున్నా లాభం లేకపోయింది.

తాండూరులో..

తాండూరు టౌన్: తాండూరులో టెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఒకే సెంటర్‌లో పరిమితికి మించి అభ్యర్థులు పరీక్ష రాయకూడదన్న నిబంధన కారణంగా ఐదుగురు అభ్యర్థుల కోసం అధికారులు ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పేపర్ –1 పరీక్షకు 485 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 23 మంది గైర్హాజరైనట్లు తాండూరు ఎంఈవో వెంకటయ్య గౌడ్ తెలిపారు.

క్లుప్తంగా

నేడు తాండూరుకు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ రాక

తాండూరు: తాండూరు పట్టణంలోని ఎస్‌వీ ఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించే బహిరంగ సభలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొంటారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అయ్యప్పరెడ్డిగూడ చోరీ కేసులో..

- నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిటెక్టివ్ సీఐ నాగరాజు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని అయ్యరెడ్డిగూడ కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి నగదును దోచుకెళ్లిన వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిటెక్టివ్ సీఐ నాగరాజు తెలిపారు. శంకర్‌పల్లి పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ.. నవాబ్‌పేట్ మండలం గంగ్యాడ గ్రామానికి చెందిన అనిల్.. మంగళవారం సాయంత్రం అయ్యప్పరెడ్డిగూడ కాలనీలోని కటికె మహేశ్ ఇంటితాళం పగులగొట్టి బీర్వాలో ఉన్న రూ.23వేల నగదును దోచుకెళ్లడం జరిగిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాలనీలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు రూ.23వేల నగదు రికవరీ, సెల్ ఫోన్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అదుపుతప్పిన బైక్..

- వ్యక్తికి గాయాలు
- ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోపాల్

ధారూరు: బైక్ అదుపుతప్పి కిందపడిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు.. అల్లిపూర్ గ్రామానికి చెందిన గోపాల్(42) శుక్రవారం పని నిమిత్తం బైక్‌పై వికారాబాద్ వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. బాచారం సమీపంలోకి రాగానే తాండూర్–వికారాబాద్ ప్రధాన రోడ్డుపై బైక్ అదుపుతప్పి కిందపడటంతో తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గోపాల్‌ను పీఎస్ వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

పహాడీషరీఫ్: నమాజ్‌కని ఇంటినుంచి వెళ్లిన ఓ యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాలు.. అల్‌జుబ్రీ కాలనీకి చెందిన అబ్దుల్ రహమాన్ (36) ఈనెల 14న ప్రార్థనల కోసమని ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై రహమాన్ భార్య కౌసరున్నీసా శుక్రవారం బాలాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసినవారు బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్ లోగాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

మట్టి గణపతికి.. జై

- కాలుష్య రహితం, స్వచ్ఛతకు ప్రతిరూపం
- మట్టి వినాయకుల వైపు ప్రకృతి ప్రేమికుల మొగ్గు
- కుల్కచర్లలో పెద్దఎత్తున తయారీ



చాపలగూడెంలో తయారైన మట్టి వినాయక ప్రతిమలు

కుల్కచర్ల: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో సైతం మార్పు వస్తోంది. ప్రకృతికి హాని కలిగించే కృత్రిమ రంగులకు దూరంగా ఉంటున్నారు ప్రజలు. రంగురంగుల గణనాథులకు బదులు మట్టిగణపతులను పూజించేందుకు నేటి యువతరం ఇష్టపడుతోంది. దీంతో మట్టితో తయారుచేసిన విగ్రహాలకు గిరాకీ ఎక్కువైంది.

స్వచ్ఛతకు ప్రతిరూపం..

వాతవరణ కాలుష్యం తదితర దుష్ప్రభావాల నేపథ్యంలో కాలుష్యరహితంగా ఉండే మట్టితో చేసిన గణనాథుని విగ్రహాల వాడకం రానురాను పెరిగిపోతోంది. ఎటువంటి దుష్ప్రభావాలు కల్గించకుండా సాధారణ రంగులు వాడుతూ గ్రామీణ ప్రాంతంలోని అందానికి ప్రతిరూపంగా నిలిచేవిధంగా రూపొందించే గణనాథుల ఏర్పాటుకు యువత మక్కువను చూపిస్తోంది.

పెద్దఎత్తున మట్టి విగ్రహాల తయారీ..

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలో 12 సంవత్సరాల నుంచి మట్టి వినాయక విగ్రహాలను తయారుచేస్తున్నారు. ముఖ్యంగా కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మట్టి వినాయక ప్రతిమలు రూపొందించడమే వ్యాపారంగా మలుచుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఒక్క కుల్కచర్ల మండలంలోనే సుమారుగా 70వేల విగ్రహాల తయారీ జరుగుతుంది. ఇక్కడ తయారుచేసిన ఈ విగ్రహాలను వివిధ పట్టణాలకు తరలించి అమ్మకాలు నిర్వహిస్తారు.

పట్టణాల్లో భలే గిరాకీ..

కుల్కచర్ల మండలంలో తయారుచేసిన మట్టి విగ్రహాలకు పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. ముఖ్యంగా విజయవాడ, హైదరాబాద్, సూర్యపేట, వరంగల్ వంటి ప్రధాన పట్టణాలకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ఎక్కువ అవగాహన ఉండటంతో యువత మట్టి గణపయ్యలను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. కుల్కచర్లలో తయారు చేస్తున్న మట్టి విగ్రహాల్లో మెజార్టీవి 4 నుండి 6 అడుగుల (ఫీట్లు) విగ్రహాలు కాగా.. మిగాత విగ్రహాలు ఒక ఫీట్ నుంచి నాలుగు ఫీట్ల ఎత్తులో ఉంటాయి.

సొంత గ్రామంలోనే ఉపాధి..

మట్టి వినాయక విగ్రహాల తయారీలో చాపలగూడెంకు చెందిన సుమారు 60మందికి స్థానికంగా ఉపాధి లభిస్తోంది. సంవత్సరంలో 3 నెలలు తప్ప మిగాతా 9 నెలలు వినాయక విగ్రహాల తయారీలో వారు నిమగ్నమై ఉంటారు. విగ్రహాల తయారీలో పనిచేసేవారికి రోజుకు ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.1000 వరకు కూలీ చెల్లిస్తారు నిర్వాహకులు.

సొంత గ్రామంలోనే ఉపాధి



వినాయక విగ్రహాల తయారీతో ఏడాదిలో తొమ్మిది నెలలు మా గ్రామంలోనే ఉపాధి లభిస్తోంది. పెద్ద పెట్టుబడి అవసరం లేకుండా సొంత మండలంలోనే దీర్ఘకాలికంగా ఉపాధి లభిచడం సంతోషంగా ఉంది. రానురాను మట్టి గణపతులకు డిమాండ్ బాగా పెరిగుతోంది.

– చంద్రకళ, చాపలగూడెం

ఏడాదికి 50వేల విగ్రహాలు



ప్రతీ సంవత్సరం సుమారుగా 50వేల మట్టి వినాయకులను తయారుచేస్తున్నాం. మనం పూజించే దైవం కాలుష్య రహితంగా ఉండాలన్న సంకల్పంతో మట్టి విగ్రహాలను తయారుచేస్తున్నాం. ఈ పనులను వ్యాపారంగా కాకుండా బాధ్యతగా భావించి చేస్తున్నాం.

– స్వామి, మట్టి వినాయక విగ్రహాల నిర్వహకుడు

మట్టి గణపతులనే పూజించండి



మట్టి వినాయకులను స్థానికంగా తయారు చేయడం వల్ల మాతో పాటుగా పది కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. మట్టి వినాయకులను తయారు చేయడం వల్ల సంతోషాన్ని పొందుతున్నాం. ప్రజలందరూ మట్టి విగ్రహాలనే పూజించాలని కోరుతున్నాం.

– గోపాల్, మట్టి వినాయక విగ్రహాల నిర్వాహకుడు

ఐక్యతతోనే హక్కుల సాధన



పరిగి: ముదిరాజ్ పోరుగర్జన నిరసన ర్యాలీలో పాల్గొన్న సంఘం నాయకులు

- ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ ముదిరాజ్
- పరిగిలో సంఘం పోరుగర్జన ర్యాలీ

పరిగి: రాష్ట్రంలోని అన్నిపార్టీలు ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదగనివ్వకుండా చేస్తున్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌ముదిరాజ్ ఆరోపించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ముదిరాజ్ పోరుగర్జన ర్యాలీని నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తా నుంచి పరిగి బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించి అనంతరరెడ్డి గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60లక్షల ముదిరాజ్‌ల జనాభా ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదన్నారు. అన్ని ప్రధాన పార్టీలు ముదిరాజ్‌లకు 18 ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టాలన్నారు. ఐక్యతతోనే హక్కులు సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పిట్లనగేష్, హన్మంతు ముదిరాజ్, రామస్వామి, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దోమ మండలం నుంచి..

దోమ: పరిగి పట్టణంలో జరుగుతున్న ముదిరాజ్ పోరుగర్జన సభకు శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి ముదిరాజులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కొడంగల్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొప్పుల అనంతరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన భహిరంగ సభలో వారు పాల్గొన్నారు.

కుల్కచర్ల మండలం నుంచి..

కుల్కచర్ల: రానున్నరోజులు బహుజన ప్రజలదేనని ముదిరాజ్ సంఘ నాయకులు బాలముకుందం, గోవర్దన్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు భారీ ఎత్తున ముదిరాజ్ పోరుగర్జన సభకు తరలివెళ్లారు. ముదిరాజ్‌లకు రాజకీయపరంగా తగిన స్థానాలు ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ సర్కార్ ఒక్క ఎమ్మెల్యే సీటుకూడా ఇవ్వకుండా ముదిరాజ్‌లకు అన్యాయం చేసిందన్నారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చంద్రలింగం, మైపాల్, రాజు, భగత్‌కుమార్, తిరుపతి తదితరులు పరగి సభకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

బైక్‌పై వెళ్తుండగా..

- మూర్ఛవ్యాధితో వాగులో పడిన బైకిస్టు, అతడి కుమారుడు
- కాపాడిన స్థానికులు



వాగులో పడిన శ్రీనివాస్‌ను బయటకు తీస్తున్న గ్రామస్తులు

దోమ: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్లాపూర్ గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాస్ తన కుమారుడితో కలసి పిండిగిర్ని మరమ్మతులు చేసే ఓ వ్యక్తిని బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్ల గ్రామంలో దించేందుకు బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో తిరిగి ఇంటికి వస్తున్న శ్రీనివాస్‌కు బ్రాహ్మణపల్లి వాగు సమీపానికి రాగానే మూర్ఛవ్యాధి వచ్చింది. దీంతో కుమాడితో సహా వాగులో పడ్డాడు. అటుగా ప్రయాణిస్తున్న దిర్సంపల్లి లైన్‌మెన్ రామాంజనేయులు, వార్డు సభ్యుడు సల్మాన్, గ్రామస్తులు అఖిల్ గమనించి వెంటనే వాగులోకి దూకి వారిని బయటకు తీశారు. తదనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూర్ఛవ్యాధితో వాగులో పడ్డ వ్యక్తితో పాటు అతని కుమారుడిని కాపాడిన దిర్సంపల్లి లైన్‌మెన్ రామాంజనేయులు, వార్డు సభ్యుడు సల్మాన్‌తో పాటు అఖిల్‌ను గ్రామస్తులు అభినందించారు.

నూరేళ్లు నిండాయా బిడ్డా..

స్కూల్ బస్సు కిందపడి రెండేళ్ల చిన్నారి మృతి

- బస్సును అక్కడే వదిలి డ్రైవర్ పరార్
- చింతుల్లలో మిన్నంటిన రోదనలు
- కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్తుల ఆందోళన

యాచారం: అయ్యో దేవుడా..నా బిడ్డకు అప్పుడే నూరేళ్లు నిండాయా.. ఇంట్లో అల్లారుముద్దుగా తిరిగే బిడ్డ ఇక కనిపించదా అంటూ చిన్నారి మృతదేహం వద్ద తల్లిదండ్రులు రోదించిన తీరు చింతుల్ల గ్రామస్తులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చింతుల్ల గ్రామానికి చెందిన మేకల శివానంద్, జ్యోతి దంపతులకు తన్విక(5), చిన్నారి(2) ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కూతురు తన్విక ఇబ్రహీంపట్నంలోని టీఆర్ఆర్ స్కూల్లో ఎల్‌కేజీ చదువుతోంది. స్కూల్ బస్సులో నిత్యం పాఠశాలకు వెళ్లేది. రోజూ మాదిరిగానే శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇబ్రహీంపట్నం నుంచి టీఆర్ఆర్ స్కూల్ బస్సు గ్రామానికి వచ్చింది. తన్వికను ఇంటికి తీసుకరావడానికి తల్లి జ్యోతితో పాటు చిన్నకూతురు చిన్నారి వెళ్లింది. ఈ క్రమంలో చిన్నారి ప్రమాదవశాత్తు అదే స్కూల్ బస్సు ఢీకొని తీవ్ర గాయాలపాలైంది. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే చిన్నారి మృతి చెందింది. ఐతే బస్సు డ్రైవర్ బస్సును అక్కడే వదిలి పారిపోయాడు.

మిన్నంటిన రోదనలు..

పాప మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పాప కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్తులు స్కూల్ బస్సు ఎదుట ఆందోళనకు దిగారు. యాచారం సీఐ సైదయ్య అక్కడకు చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చిన్నారి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌ను శిక్షించడంతో పాటు, కుటుంబ సభ్యులకు పరిహారం అందజేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీంతో టీఆర్ఆర్ స్కూల్ యజమాన్య ప్రతినిధులు గ్రామానికి వచ్చి గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు.

నందిగామలో దొంగల హల్‌చల్

- వారం వ్యవధిలో మూడు చోరీలు
- మహిళ మెడలో నుంచి చైన్ లాక్కెళ్లిన దుండగుడు

నందిగామ: నందిగామలో రోజురోజుకు దొంగలు చెలరేగిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఓ బోరుమోటార్ చోరీ, రెండు చైన్ స్నాచింగ్ కేసులు నమోదవ్వడమే ఇందుకు ఉదాహరణ. నందిగామ ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. అప్పారెడ్డిగూడకు చెందిన చిన్నసాయి మంజుల శుక్రవారం మధ్యాహ్నం చంద్రాయన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడ వైపునకు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ.. దుండగుడు కొత్తూరు వైపునకు పారిపోయినట్లు సీసీ కెమెరాలో ఫుటేజీ లభ్యమైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని.. దుండగుడిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి ఫుటేజ్

మద్యం మత్తులో వాగ్వాదం

ఒకరి దారుణ హత్య

నందిగామ: పొట్టచేత పట్టుకొని వలసవచ్చిన ఓవ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని చాకలిగుట్ట తండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపిన కథనం ప్రకారం... బీహార్ రాష్ట్రం బక్సార్ జిల్లా బాషి గ్రామానికి చెందిన తున్‌తున్ చౌదరి(41) కొత్తూరులో నివాసం ఉంటూ మేకగూడ సమీపంలోని ఓ గోదాంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బీహార్ రాష్ట్రం బక్సార్ జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ్ బిందు, గుడియా దేవి భార్యభర్తలు చాకలిగుట్ట తండాలో నివాసం ఉంటూ సమీపంలోని ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. తున్‌తున్ చౌదరి, అక్షయ్ బిందు దూరపు బంధువులు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తున్‌తున్ చౌదరి, అక్షయ్ బిందు ఇంటికి రాగా వారిద్దరితో పాటు గుడియా దేవి (మొత్తం ముగ్గురు) మద్యం సేవించారు. ఈ క్రమంలో ఆ ముగ్గురికి గొడవ చోటుచేసుకుంది. ఒకరికొకరు కొట్టుకోవడంతో తున్‌తున్ చౌదరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు అక్షయ్ బిందు, గుడియా దేవిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

ప్లాట్ల విషయంలో ఘర్షణ

పలువురిపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్లాట్ల విషయంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం పోలీస్ కేసు దాకా వెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాలు... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 5/అ లో గల ప్లాట్ నం.470, 471, 472ను సుర్మాయిగూడ గ్రామానికి చెందిన హుస్సేన్, కరిమెల శ్రీకాంత్.. కొనుగోలు చేసి అట్టి ప్లాట్లలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం కొంతమంది వ్యక్తులు అక్రమంగా వారి ప్లాట్లలోకి చొరబడి వాచ్‌మెన్ వెంకటేశ్‌ను బంధించి ఇంటి నిర్మాణానికి వాడుతున్న వస్తువులను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలంలో ఘర్షణ పడిన మొత్తం 19మందినిగుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

200 గ్రాముల గంజాయి పట్టివేత

- నిందితుడి అరెస్టు

ఇబ్రహీంపట్నం: గంజాయితో పట్టుబడిన యువకుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన రెడ్డిమల్ల భరత్(20).. గురువారం రాత్రి నగరంలోని ధూల్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసుకొనివస్తున్నాడు. ఇదే సమయంలో ఇబ్రహీంపట్నంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, పీసీ శేఖర్, హెచ్‌జీ శ్రీశైలం.. పాలిథిన్ కవర్‌లో గంజాయిని తీసుకొస్తున్న భరత్‌పై అనుమానంతో పట్టుకోడానికి ప్రయత్నించగా పరిపోయేందుకు యత్నించాడు. పోలీసులు భరత్‌ను పట్టుకోని అతని వద్ద నుంచి 200 గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కాగా ఇతడిపై గతంలోనే మూడు ఆస్తి వివాదాలకు సంబంధించిన కేసులున్నట్లు సమాచారం.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని రాచకొండ కమిషనరేట్ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రజాజీవనం శాంతియుతంగా ఉన్నప్పుడే పెద్ద పెద్ద సంస్థలు, కంపెనీలు నెలకొల్పేందుకు ముందుకు వస్తాయన్నారు. పోలీస్ వ్యవస్థకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేసి సీఎం కేసీఆర్ అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, స్థానిక ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ గురునాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంటకరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

తుర్కయంజాల్: గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్ మాసబ్ చెరువును శుక్రవారం చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా మాసబ్ చెరువులో గణనాథుల నిమజ్జనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నగర శివారు ప్రాంతం కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి దానికి తగ్గ రీతిలో ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్, మున్సిపల్ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న సీపీ చౌహాన్



కనకదుర్గా అమ్మవారి ఆలయ నమూనాలో మండపం

'బాలాపూర్' వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు

- 18 ఫీట్ల ఎత్తుతో గణేశుడి విగ్రహం
- కనకదుర్గ ఆలయ నమూనాలో మండపం

బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుని వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇక్కడ ఏటా గణేశుడి సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. స్వామివారి చేతిలోని లడ్డూకు ఎక్కడా లేని డిమాండ్ ఉంటుంది. ఈసారి ఐదు తలల నాగరాజు పడగల కింద స్వామివారిని సుందరంగా రూపొందించారు. విజయవాడ కనకదుర్గ ఆలయ నమూనాలో మండపాన్ని తీర్చిదిద్దుతున్నారు. కోల్‌కతాకు చెందిన కళాకారులు 11 రోజులుగా ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. 18 ఫీట్ల ఎత్తుతో స్వామివారి విగ్రహాన్ని తయారు చేయించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తెలిపారు.



ఐదుతలల నాగరాజుతో బాలాపూర్ గణేశుడు